# పదిమంది శిష్యుల కలవరం తొలగించిన పునరుత్థానుడు

లూకా 24:38 అప్పుడాయన మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల?"

పునరుత్థాన ఆదివారం సాయంకాలమున పదిమంది అపోస్తులులు యూదులకు భయపడి ఒక ఇంటిలో కూడుకొని, ఆ ఇంటి తలుపులు మూసికొని ఆరోజు జరిగిన విషయాలపై కలవరపడుచు మాట్లాడుకొనుచున్నారు. ఎందుకు యేసు శిష్యులు కలవరపడు చున్నారు? కారణం జరుగుచున్న మరియు వారు వినుచున్న విషయాలన్నీ వారిని అయోమయ స్థితిలోనికి నెట్టుచున్నవి. యేసు శరీరాన్ని ఎవరో ఎత్తుకొని పోయారని వచ్చిన అల్లరి పుకారు గురించి మాట్లాడుకొనుచున్నారు, దాని గురించి దుఃఖపడుచూ ఉండగా,అంతలోనే స్త్రీలు వచ్చి ఆయన సజీవుడై యున్నాడని ప్రకటిస్తున్న దేవదూతలను చూశామని స్త్రీలు చెప్పుచున్న మాటల గురించి ఈ పదిమంది శిష్యులు ఆశ్చర్యపోయిన స్థితిలో ఉన్నారు. ఇంతలో ఎమ్మాయి ఇంటిలో ప్రభువు రొట్టె విరుస్తుండగా యేసును గుర్తించిన ఇద్దరు శిష్యులు హడావుడిగా యేరుషలేములో ఉన్న ఇతర శిష్యుల యొద్దకు తిరిగివచ్చి ఎమ్మాయిలో జరిగిన సంగతులన్నీటి గూర్చి మాట్లాడారు. యేసు తమతో ఎమ్మాయి వరకు నడిచాడని, తమ కళ్ళు ఆయనను గుర్తించలేకపోయాయని, రొట్టె విరుస్తుంటే, అప్పుడు ఆయనను గుర్తించామని, తమ కళ్ళముందే యేసు అదృశ్యుడయ్యాడని చెప్పుచుంటే మిగతా శిష్యులు ఆశ్చర్యపోయారు.

## 1. కలవరపడిన అపోస్తలులు

కళ్ళు తెరవబడట మేమిటో, గుర్తించడమేమిటో యేసు అదృశ్యుడవడం ఏమిటో ఏమి అర్థం కాలేదు. ఒకవేళ బయటకు వెళ్లి జరిగిన విషయాలను గూర్చి ప్రజలలో ఆరా తీద్దామని అనుకొంటే యూదుల భయంతో గడిదాటి బయటకు రాలేని పరిస్థితి. మొత్తానికి ఈ పదిమంది శిష్యుల పరిస్థితికూడా తీవ్రమైన్న అయోమయానికి గురై కలవరపడిన స్థితిలో ఉన్నారు. ఈ పదిమంది శిష్యులు ప్రభువును గూర్చి రకరకాల వార్తలు వింటూ ఏది నిజమో ఏది అబద్ధమో ఏది నమ్మాలో ఏది నమ్మకూడదో అర్థంగాక మతి పోయిన పరిస్థితులలో నెమ్మది లేక వారి హృదయంలో తీవ్రమైన అలజడి రేగి సమాధానం లేని స్థితిలో ఉన్నారు. సాతాను ఒక్కోసారి అలజడి అల్లరి రేపే వార్తలతో మన మనసులకు నెమ్మది లేకుండా చేసి తీవ్రమైన ఆందోళనకు గురి చేస్తాడు. అయితే విశ్వాసులైన వారు ఇటువంటి తీవ్రమైన అలజడి కలిగిన సమయాల్లో ప్రభువు యందు నమ్మకం ఉంచితే ఆయన ప్రతి సమస్యను గ్రహించుటకు, వివేచించుటకు మనకు వివేకం అనుగ్ర హిస్తాడు. (2తిమోతి 2:7 నేను చెప్పు మాటలు ఆలోచించుకొనుము; అన్ని విషయములయందు ప్రభువు నీకు వివేకమను గ్రహించును.)

## 2. మూసిఉన్న తలుపులలో నుండి యేసు లోపలకు వచ్చుట

శిష్యుల కలవరం తొలగించుటకు యేసు ఆ ఇంటిలోనికి ప్రవేశించిన విధానం అమోఘం మరియు అద్భుతం. లూకా మరియు యోహాను ప్రకారం, పునరుత్థాన ఆదివారం సాయంకాలం యేసు యొక్క ప్రత్యక్షత జరిగినట్టు మనం

చెప్పవచ్చు. యేసు శిష్యుల యొక్క కలవరంనుండి అయోమయ స్థితినుండి విడిపించుటకు ప్రత్యక్షమయ్యాడు. (యోహాను 20:19 ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి, తాము కూడియున్న యింటి తలుపులు మూసి కొనియుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి). యింటి తలుపులు మూసి ఉన్నవని లూకా భక్తుడు చెప్పుచున్నాడు. తలుపుకు వేసిన గడియ వేసినట్లే ఉంది. కాని అకస్మాత్తుగా అందులో నుండి యేసు లోపలకు రావడం చూసిన శిష్యులందరు ఒక్కసారి ఎంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. అది ఎంతో ఆశ్చర్యం అనిపించింది. కాని క్రీస్తు గాయాలు గలిగిన మామూలు శరీరంతో ఉన్నాడు గదా! మరి అటువంటప్పుడు మూసివున్న తలుపులలో నుండి ఎలాగు లోపలకు రాగలిగాడు? అదే యేసు యొక్క పునరుత్థాన శరీరం యొక్క ప్రత్యేకత. యేసు తన పునరుత్థాన శరీరంలో ఉన్నాడని, *ఆశరీరం ఈ లోకానికి చెందిన భౌతిక సూత్రాలకు కట్టుబడి ఉండదని మనం గ్రహించాలి. మరియు ఆయనను నమ్మిన మనందరికీ వాగ్దానం చేయబడిన మహిమ దేహం కూడా ఇలాగే ఉంటుంది. (1యోహాను 3:2 ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్ష పరచబడ లేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందు మని యెరుగుదుము.) అందుకే ఆయన పేరు ఆశ్చర్యకరుడు అని పిలువబడినది. ప్రియ దేవుని బిడ్డలారా! భయంకరమైన సమాధి రాయిని జయించి బయటకు వచ్చిన పునరుత్థానునికి మూసి ఉన్న ఈ సాధారణ తలుపులు ఒక లెక్కా!

## 3. సమాధానం కలుగును గాక

శిష్యుల మనస్సులు తీవ్రమైన కలవరం అలజడితో సమాధానం లేని స్థితిలో ఉండగా తన శిష్యులను ఆదరించి వారి కలవరం తొలగించి సమాధానం అందించుటకే యేసు వారి మధ్య ప్రత్యక్షమయ్యాడు. మన దేవుడు సమాధానానికే గాని అల్లరికి కర్త కాడని గమనించాలి. (లూకా 24:36 వారు ఈలాగు మాటలాడుచుండగా ఆయన వారి మధ్యను నిలిచి "మీకు సమాధానమవుగాకని వారితో అనెను".) సమాధానం లేని స్థితిలో ఉన్న ఈ లోకానికి సమస్తమైన సమాధానం ఇచ్చుటకే దేవుడు తన కుమారుని ఈ లోకానికి సమాధానకర్తగా పంపాడు. తన కుమారుని బలియాగం ద్వార ఈ లోకంలోసమాధానం స్థాపించాలని దేవుని సంకల్పం. (కొలస్సయి 1:20 "ఆయన సిలువరక్తముచేత సంధిచేసి, ఆయనద్వారా సమస్తమును, అవి భూలోక మందున్నవైనను పరలోక మందున్నవైనను, వాటినన్నిటిని ఆయనద్వారా తనతో సమాధానపరచుకొన వలెననియు తండ్రి అభీష్టమాయెను.") యేసు పాప క్షమాపణను సాధ్యం చేస్తూ మానవజాతి కోసం తన జీవాన్ని అర్పించాడు ఎందుకంటే, మన సమాధానం రావడం కోసం ఆయన తనపై శిక్షను వేసుకున్నాడు.

## 4. యేసును చూచి భూతమని భావించిన శిష్యులు

శిష్యులైన వారు ఇప్పటి వరకు, పునరుత్థానుడు పేతురుకు ప్రత్యక్షమవడం గురించి, ఎమ్మాయి శిష్యులకు ప్రత్యక్షమవడం గురించి మాట్లాడుకుంటున్నారు. ఆహా ఎంత అద్భుతం! ఆ అద్భుత దృశ్యం మేము చూడలేక పోయాము గదా అన్న మిగతా శిష్యులు అనుకుంటుండగానే ప్రభువు వారి కోరిక తీర్చాడు. మూసి ఉన్న తలుపుల్లో

నుండి ఏదో ఒక ఆకారం లోపలకు రాగానే, ఏదో దయ్యం తమకు కనబడిందనుకొంటూ శిష్యులు హడలిపోయి భయాక్రాంతులయ్యారు.

భీతి చెందిన మనస్సులకు, తీవ్రమైన ఆందోళనతో ఉన్న హృదయాలకు దేవుడు దర్శనమిచ్చినా అది దయ్యంలాగే కనబడుతుంది. (లూకా 24:37 "అయితే వారు దిగులుపడి భయాక్రాంతులై, భూతము తమకు కనబడెనని తలంచిరి.") భయంతో నిండి ఉన్నవారికి, సహజంగానే, గడియ వేసి ఉన్న తలుపులో నుంచి రాగలిగేది భూతం, లేక ఆత్మ మాత్రమే అనుకుంటారు గదా! చనిపోయిన యేసు సజీవంగా వస్తాడని నమ్మడం లేదు కనుక అకస్మాత్తుగా ఆయన కనిపించటం మరియు కనుమరుగవడం వారు ఊహించి యుండలేదు. భయంతో ఒక్కరి నోటవెంబడి మాట రావడం లేదు. కంగారుతో యేసును చూచి వణికిపోవడం ప్రారంభించారు. యేసు వారి కలవరపడిన స్థితి అర్థం చేసుకొని, వారి యెడల ఎంతో ప్రేమతో వారి తాత్కాలిక సందేహాలను తీర్చి తానే యేసునని వారికి భరోసా ఇవ్వటానికి ప్రయత్నిస్తున్నాడు. (లూకా 24:38 "అప్పుడాయన మీరెందుకు కలవర పడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల?")

## 5. తన చేతులను కాళ్ళను చూపించిన యేసు

(లూకా 24:40 తన చేతులను పాదములను వారికి చూపెను.) ఆయన్ను సిలువ వేసినప్పుడు ఆయన చేతులకు కాళ్ళకు అయిన గాయాల గుర్తులు ఉన్నాయి. యేసు పలికిన ఈ మాటలను బట్టి సమాధినుండి ఆయన భౌతిక దేహం సజీవంగా లేచిందని రుజువౌతున్నది. ఆయన సజీవంగా లేవడం ఏదో ఒక ఆత్మ మేలుకోవడం వంటిది కాదు. సిలువ అనుభవించి, సమాధి పాలైన దేహమే ఇప్పుడు తిరిగి లేచింది. యేసు యొక్క పునరుత్థాన శరీరం ఈ లోకానికి చెందిన భౌతిక సూత్రాలకు కట్టుబడక పోయినా ఆ దేహాన్ని ఇతరులు చూడవచ్చు, తాకవచ్చు. యేసును తనను తాకి చూడటానికి వారిని ప్రోత్సహించాడు. మరియు తాను మాంసం మరియు ఎముకలను కలిగి ఉన్నాడని వారికి తెలియచేశాడు. దెయ్యం లేదా భూతానికి వలె కాకుండా తనను తాకి అనుభూతి పొందమన్నాడు. (యోహాను 20:20 ఆయన ఆలాగు చెప్పి వారికి తన చేతులను ప్రక్కను చూపగా శిష్యులు ప్రభువును చూచి సంతోషించిరి.) యేసు తన చేతులలో మరియు కాళ్ళలో మేకుల గుర్తులు చూపించాడు.

## 6. వారితో కలసి భోజనం చేయుట

శిష్యులు యేసును చూచి సంతోష పడుచున్నగాని ఇంకా వారి మనస్సులో ఎక్కడో అనుమానం ఉన్నది. అది గ్రహించిన యేసు తన పునరుత్థాన శరీరం వాస్తవమైనదని తన శారీరక వాస్తవికత రుజువు చేయుటకు వారికి మరొక గుర్తును ఇస్తున్నాడు. యేసు"తినడానికి ఇక్కడ ఏమైనా ఉందా?" అని వారిని అడిగాడు. కాల్చిన చేప ముక్కనూ కొంత తేనెపట్టునూ వారాయనకు అందించారు. ఆయన వాటిని తీసుకొని వారి కండ్లెదుటే తిన్నాడు. దీనిని బట్టి యేసు యొక్క పునరుత్థాన శరీరం ఆహారాన్ని కూడా జీర్ణం చేసుకోగలదని కూడా చెప్పబడినది.

## 7. లేఖనములు గ్రహించునట్లు వారి మనస్సులు తెరచుట

వారి కలవరం తొలగిన తరువాత ప్రభువు ఎమ్మాయి శిష్యులకు వివరించినట్లు తన పుట్టుక, తన శ్రమ మరణ పునరుత్థానాన్ని గురించిన పూర్తి విషయాలను లేఖన ప్రవచనాలను మరియు వాటి నేరవేర్పును గురించి పదిమంది అపోస్తులులకు వివరించి చెప్పాడు. మోషే ధర్మశాస్త్రంలో, ప్రవక్తల గ్రంథంలో, కీర్తనలలో తన గురించి వ్రాసి ఉన్న విషయాలన్నీ నెరవేరడం తప్పనిసరి" అని శిష్యులకు ప్రేమతో వివరించాడు. వారు లేఖనాలు గ్రహించగలిగేలా వారి మనసులను తెరిచాడు. (లూకా 24:44-46 అంతట ఆయనమోషే ధర్మశాస్త్రము లోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్నుగూర్చి వ్రాయబడిన వన్నియు నెరవేరవలెనని నేను మీయొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నేరవేరినవని వారితో చెప్పెను. అప్పుడు వారు లేఖనములు గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సును తెరచి క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు)

ఈ దినాలలో కూడా అనేకులు యేసును ఒక హతసాక్షి యైన అమర వీరునిగానే చూస్తున్నారు గాని యేసు స్పష్టంగా తాను మృతులలో నుండి లేచానని స్వయంగా ఇక్కడ చెప్పుచున్నాడు. ఇక ఎటువంటి సందేహానికి తావులేదు.

ప్రియమైన వారలారా ! శిష్యులు యేసు పునరుత్థానానికి ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారు. వారి స్పష్టమైన వివరణలు సాక్ష్యాలు వారి పత్రికలలో మనకొరకు వివరంగా వ్రాయబడ్డాయి. అలాగే వారుమొదటి అవిశ్వాసం చూపినా తరువాత గ్రహించి ప్రభువుకు గొప్ప సాక్షులయ్యారు. యేసు మరణం నుండి లేచాడని, యేసు పునరుత్థానుడని సజీవుడైన దేవుడని ఇప్పుడు మనము మన తరానికి ఈ అద్భుతమైన, అఖండమైన, దృగ్విషయాన్ని ప్రకటించటానికి బాధ్యత వహించవలసి యున్నది. అట్టి గొప్ప సాక్షులుగా పునరుత్థాన యేసు కొరకు జీవించు కృపను పరిశుద్ధాత్మ దేవుడు మనకు కలిగించును గాక .